## జి.వి. రావ్ పేజీ
(గోటేటి వేంకటేశ్వరరావు)

# ఆత్మవిశ్వాసం కోల్పోకు, నీకీ లోకంలో అసాధ్యమేది లేదు.

- స్వామి వివేకానంద



పై వివేకానందుని సూక్తి ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడి విషయంలో వర్తిస్తుంది. ఎందుకంటే 2002 నుండి మోడిని అతని రాజకీయ ప్రత్యర్థులు, మీడియావారు, ఎన్‌జివోలు, ముస్లిము సంఘాలు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని రకాలుగా హింసించాలో, ఎన్ని ఇబ్బందులు కల్గించాలో, ఎంతగా విసిగించాలో అన్ని రకాలుగా చిత్రహింసలు పెట్టారు. మనదేశంలోనే కాక విదేశాలలో ఆయన పరపతికి అప్రతిష్ట వచ్చేలా చేసారు. దానితోపాటు మన భారతదేశ మర్యాద మంట కలిపారు. వీటన్నిటిని గత పన్నెండేళ్ళుగా మోడి ఎదుర్కొంటూనే వున్నారు. గుజరాత్ రాష్ట్రప్రజలు ఆయనకు గత 15 ఏళ్ళుగా బ్రహ్మరథం పడుతూనే వున్నారు. ఒక ప్రక్క ఈ కేసులన్నీ ఎదుర్కొంటూనే ఆయన గుజరాత్‌ని అభివృద్ధి పథంలో నడిపించారు. దేశవిదేశాలలో గుజరాత్ గురించి మాట్లాడుకునేట్టు చేసారు. పల్లెటూర్లకు కరెంట్ వసతి కల్పించారు. నర్మదాడామ్ ద్వారా నీరు దొరికేట్టు చేసారు. అటువంటి మోడిని భారతీయ జనతాపార్టీవారు ఈ సారి ఎలెక్షన్లలో ప్రధానమంత్రి పదవికి అభ్యర్థిగా ప్రకటించి పగ్గాలు ఆయన చేతికిచ్చారు. మోడి ఆ పనిని సమర్థవంతంగా నిర్వహించడమే కాకుండా గుజరాత్ ప్రజలే కాకుండా యావత్ భారత దేశంలోని ప్రజలను ప్రభావితం చేసి తనను, తన పార్టీని గెలిపించారు. పైన చెప్పిన దుష్టశక్తుల నన్నిటిని అధిగమించి ప్రజాశక్తితో గెలుపొందారు. ప్రజలు ఆయనను నమ్మారు. గుజరాత్ అల్లర్లలో ఆయనకు ప్రత్యక్ష సంబంధం లేదని కోర్టులు తీర్పునిచ్చాయి. నరేంద్రమోడి మాటలు, నడవడిక, దేశం పట్ల ఆయన విధేయత, పార్టీ పట్ల నిబద్ధత మచ్చలేని జీవితం ఇవన్నిటిని భారతదేశ ప్రజలు నమ్మారు. ఇక్కడ నేను హిందువు, ముస్లిం అని చెప్పటం లేదు. ఎందుకంటే ఎవరయితే దేశాన్ని ప్రేమిస్తారో దేశాన్ని గౌరవిస్తారో వారందరూ భారతదేశ ప్రజలే. ఒక టీ కొట్టులో పనిచేసిన కుర్రాడికి, అంచెలు అంచెలుగా పైకి వచ్చిన ఒక వ్యక్తికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు, అదీ మన దేశ ప్రజాస్వామ్యం. అందుకనే మోడి ప్రజాస్వామ్య కోవెలగా అభివర్ణించారు. ప్రపంచ దేశాలు అన్ని మనల్ని చూసి అసూయపడేటంతటి ప్రజాస్వామ్య దేశం మనది.



గత కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, జవాబుదారితనం, అన్ని రంగాలోనూ వైఫల్యం చెందిన సమయంలో భారతదేశ ప్రజల ఆశాజ్యోతిగా నరేంద్రమోడి కనిపించారు. ప్రజాస్వామ్యానికి కొత్త అర్థం చెప్పారు.

నరేంద్రమోడి ప్రధానిగా ఎన్నిక కావడం ఒక భారతీయుడిగా నాకు చాలా సంతోషంగా వుంది. జన్మభూమిని, కన్నతల్లిని గౌరవించే సంస్కారవంతమైన దేశం మనది. అటువంటి మనదేశంలో మొట్ట మొదటసారిగా భారతమాతాకు జై, వందేమాతరం అనే ప్రధానమంత్రి రావడం భారతీయుడిగా నాకు గర్వ కారణం. 1947 తరువాత ఇన్ని సంవత్సరాలకు ఒక ప్రధానమంత్రి భారతమాతకు వందేమాతరం అంటూంటే నా మేను పులకించి పోయింది. ఆ ఆనందాన్ని సరిగ్గా



వర్ణించలేకపోతున్నాను. తల్లి దీవెన, అదే భారతమాత దీవెన వుంటేనే మనకు అభివృద్ధి.



ఒక్కసారి ఆయన మాటతీరుని గమనించండి. అభివృద్ధి ఆయన మంత్రం. ఎన్నికల్లో గెలుపొందిన వెంటే తన తల్లి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆ తల్లి ఆయనకు రామాయణం పుస్తకాన్నిచ్చారు. వారణాసిలో గెలుపొందినందుకు కృతజ్ఞతగా గంగమ్మ తల్లికి నమస్కరించి గంగాహారతి ఇచ్చారు. పార్లమెంట్‌లోకి అడుగిడుతూ ఆ పార్లమెంటును ప్రజాస్వామ్య కోవలెగా అభివర్ణించి అక్కడ మెట్లమీద ముద్దాడి, రాజకీయ గురువు పాదాబివందనం చేసి సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ దేశసేవ, తల్లికిసేవ చెయ్యడానికి వచ్చాను. ఇది నా జన్మభూమి, నా అభివృద్ధికి కారణమైన నా పార్టీకి నేను తీర్చుకున్న ఋణం అని తన గొప్పతనాన్ని ఇసుమంతైనా చెప్పలేదు.

125 కోట్ల భారతదేశ ప్రజలలాగే నేను మోడిపై చాలా ఆశలు పెట్టుకున్నాను. ఆ ఆశలు అడియాశలు కావని నమ్ముతున్నాను. రేపటినుండే అద్భుతాలు జరిగిపోతాయని చెప్పనుగాని, తప్పకుండా మోడి దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తారని ఆశిస్తూ, భారతమాతాకు జై, వందేమాతరం! ●


*We Provide your comfortable Stay and Tasty Food Hospitality*

bd

**Bhimas Deluxe Hotel**

**(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)**

**34-38, G.Car Street (Near Railway Station),**
**TIRUPATI - 517 501 (A.P.)**
**Phone : 0877-2225521, 6669199, Fax : 2225471**
**Website : www.bhimasdeluxehotels.com**
**E-mail : bhimasdeluxe@rediffmail.com**